# మేలు చేసిన మఱ్ఱి

"నీకెంత డబ్బుంటే మాత్రం, ఎంతమంది నౌకర్లుంటే మాత్రం, ఎన్ని మేడలుంటే మాత్రం నోటికి వచ్చినట్లు తిట్టడానికి నీ కధికారం ఎవరిచ్చారు? ఎప్పుడో డబ్బిచ్చానని యిప్పుడు మొత్తుకుంటే లాభమేముంది అప్పుడే అడగక పోయావా? మొహాన్న పారేస్తును." అని గంగన్న వెంకన్నను బుకాయిస్తున్నాడు. వెంకన్న కొంచెం మెత్తని మనిషి: మాట్లాడలేక పోతున్నా మెల్లమెల్లగా ఘాటైన మాటలే ఒదుల్తున్నాడు. ఆ మాటలు వింటూంటే గంగన్నకు అరికాలి మంట నెత్తికెక్కుతూంది. ఇద్దరూ ఘర్షణ పడుతూండడం చూచి ఆవీధిలోని నలుగురు పెద్దలు వచ్చి విడిపించి అసలు సంగతేమిటని అడిగారు. వెంకన్న యిలా అన్నాడు.

"రెండు సంవత్సరాల క్రితం, మన ఊరులో పాలిపేట కాలిపోయిన సంగతిమీకు తెలుసు అప్పుడు లబో లబోమంటే, యీ గంగన్నకు రెండొందల రూపాయలు యిచ్చాను - కొంప కట్టుకుంటానంటే. అవి అడిగితే అదిగో యిదిగో అని జరిపాడేకాని యిప్పటివరకూ యివ్వలేదు. ఇప్పుడు కొంచెం ఘాటుగా అడిగితే అసలుడబ్బు యివ్వనే లేదంటున్నాడు. పైపెచ్చు నోటికివచ్చిన మాటలు కూస్తున్నాడు."

"ఏం, గంగన్నా! వెంకన్నగారు చెప్పింది నిజమేనా?" అని ఓపెద్ద మనిషి అడిగాడు "అదేంటండీ! మీరూ అలాగే అంటారు. వెంకన్నగారి దగ్గర డబ్బు బదులు పుచ్చుకోటానికి నేనేం కొంపలేని వాడననుకుంటున్నారా. ఐదు కుంచాల మాన్యం ఉంది. అది అమ్మి అప్పుడు ఇల్లు కట్టాను."

గుణ్ణం వెంకట్రాజు

'అయితే వెంకన్నగారు ఊరికే నీమీద నింద వేస్తున్నారా' అని అందుకున్నాడో పెద్దమనిషి.

'ఏమో లెండి. ఆయన కాస్త ఉన్నవాడు-ఎలా చేసినా చెల్లుతుంది' అని ఏమేమో వాగుతుండగా మునసబుగారు రావడంచూచి అందరూ లేచారు. గంగన్నకు మునసబు గార్ని చూడ్డం తడవుగా గుండె నీరైపోయింది. మునసబుగారు ఎంత దయగలవారో అంత కఠినులు. ఎవరైనా తప్పుచేసి లేదన్నారా - వాడిచర్మాలు లాగేవారు. లేదా తప్పు ఒప్పుకున్నాడా వాడికి నష్టం లేకుండా, స్వల్పనష్టాలు యీాయనే భరించేవాడు. తెలివైన వాడు, గౌరవనీయుడు. అందుచేత గంగన్న ఏం జరుగుతుందో అని భయపడుతున్నాడు.

మునసబుగారు చుట్ట ముట్టించి వీధి అరుగుమీద కూర్చున్నారు. వంపుతిరిగిన పేముబెత్తం ప్రక్కనే ఉంది. క్రింది అరుగుమీద పెద్ద మనుష్యులు కూర్చున్నారు, ఊరి కరణం, మిగతా నౌకర్లు అరుగు ప్రక్కనే నిలబడ్డారు. మునసబుగారికి జరిగినదంతా విన్నవించాడు వెంకన్న. ఈవార్త ఎప్పుడు ప్రాకిందో ఊళ్లో జనమంతా అక్కడికి ఒచ్చేశారు. ఎవ్వరూ కిక్కురుమనటం లేదు.

'వెంకన్నగారూ! మీరు గంగన్నకు యిచ్చిన సొమ్ముకు నోటుగాని, సాక్ష్యముగాని ఏమీ లేదు గదూ?' అన్నారు మునసబుగారు.

'అవునండీ, ఆవేళ నేను కాకినాడనుండి వస్తుంటే మధ్యత్రోవలో కలుసుకొని ఎలా అయినాసరే రెండు వందలుసాయంచేస్తే, కొంపనిలబడుతుంది. లేకపోతే ప్రాణాలు నిలువునా పోతాయి' అని కాళ్ళావేళ్ళా పడ్డాడండి దాంతో నేను జాలిపడి మఱ్ఱిచెట్టుక్రింద నిలబడి రెండు వందలు యిచ్చానండి. నమ్మకంగల వ్యక్తి గనుక నోటు వ్రాయించుకో లేదు. ఇప్పటికిది జరిగి రెండు సంవత్సరాలైంది.'

'ఏం గంగన్నా! వెంకన్నగారు చెప్పిందానిలో ఏమైనా తప్పుంటే చెప్పుకుంటావా?'

"అంతా తప్పేనండి బాబయ్యా! యీ రోజుల్లో నోటూ, పాటూ

# ★ మేలుచేసిన మఱ్ఱి ★

లేకుండా ఎవరిస్తారు బాబయ్యా డబ్బు?"

ఏం తీర్పు చెప్తారో అని అందరూ గ్రుడ్లు మిటకరించి చూస్తున్నారు. మునసబుగారు మరోచుట్ట వెలిగించారు. అంతా నిశ్శబ్దంగా చూస్తున్నారు. 'అయితే వెంకన్నగారూ! మీకు ఆ మఱ్ఱిచెట్టు తప్ప ఇంకో సాక్ష్యం ఏమీ లేదన్నమాట. సరే బావుంది. మీరు వెళ్లి ఆమఱ్ఱిచెట్టును ఇక్కడకు తీసుకురాగలరా' అన్నారు. అందరూ నిశ్చేష్టులయ్యారు. మునసబుగారి కేమైనాపిచ్చి యెత్తిందా అనుకున్నారు.

'చెట్టు ఎలా వస్తుందండీ యిక్కడకి' అన్నాడు వెంకన్న?

'నేను రమ్మన్నానని చెప్పు' అన్నారు మునసబుగారు.

ఇహ చేసేదిలేక, మునసబుగారిని కాదనలేక, వెంకన్న మఱ్ఱిచెట్టు దగ్గరకు వెళ్ళాడు. అందరకీ అయోమయంగా ఉంది.

వెంకన్నగారు వెళ్ళిన అరగంటకు మునసబుగారు గంగన్నను ప్రశ్నించారు 'గంగన్నా! ఈ పాటికి వెంకన్న మఱ్ఱిచెట్టు దగ్గరకు వెళ్ళగలడంటావా?'

'ఇంకా వెళ్ళలేరండి, అది యిక్కడకు సుమారు రెండుమైళ్ళుంటుంది. పైగా చెఱువుగట్టున దారి వర్షం మూలన బావుండదు.' అన్నాడు గంగన్న.

ఇది అందరూ విన్నారు. గంగన్న మాటలు, మునసబుగారి ప్రవర్తన, వెంకన్నగారు చేస్తున్నపని చూస్తూవుంటే ప్రజలందరకీ బుర్రలు చెడిపోతున్నాయి.

సరే! ఉదయం గం 10 లకు వెళ్ళిన వెంకన్న, మధ్యాహ్నం గం 12 లకల్లా వచ్చేశాడు. 'చెట్టు మాట్లాడలే'దని చెప్పాడు వెంకన్న మునసబుగారితో.

'అక్కర్లేదోయి! చెట్టు యిక్కడకు రాకుండానే అంతా నాకు తెలిసిపోయింది. గంగన్న డబ్బు పుచ్చుకున్న మాటనిజమే. అది నీకు గంగన్న యిస్తానని కూడా ఒప్పుకుంటున్నాడు' అని అనడంతోనే జనమంతా చెవులకు బాగా పని చెప్పి వినడం మొదలెట్టారు. గంగన్న వణుకుతున్నాడు.

మునసబు మరోచుట్ట వెలిగించాడు. బెత్తం పట్టుకొని లేచాడు. అందరితో యిలా అన్నాడు 'వెంకన్నను నేను చెట్టుదగ్గరకు ఎందుకు వెళ్ళమన్నానో మీకు యీపాటికి తెలిసేఉంటుంది. చెట్టేమిటి యిక్కడకు సాక్ష్యం యివ్వడానికి రావడం ఏమిటి? ఇది జరుగుతుందని నేను వెంకన్నను పంపలేదు. గంగన్న నిజాయితీ తెలుసుకోవాలని యిలా చేశాను. చూడండి. మీరందరూ వింటూండగానే, వెంకన్న చెట్టుదగ్గరకు వెళ్ళిన తరువాత గంగన్నను నేను అడిగాను 'వెంకన్న చెట్టుదగ్గరకు వెళ్ళగలడా అని'. దానికి గంగన్న చెప్పిన జవాబు మీరు విన్నారు. 'లేదండి అది యిక్కడికి సుమారు రెండుమైళ్ళుంటుంది. పైగా చెఱువుగట్టున ఉంది. వర్షం కూడా,' అని చెప్పాడు కదా, గంగన్న! గంగన్నేగాని వెంకన్నగారు కాకినాడనుంచి తిరిగి వచ్చేటప్పుడు ఆ మఱ్ఱిచెట్టు క్రింద రెండు వందలూ అప్పు పుచ్చుకోని వుండకపోతే, ఆ మఱ్ఱిచెట్టు ఇక్కడకు ఎంత దూరముందో గంగన్న కెలా తెలిసింది? నిజంగా ఆ మఱ్ఱిచెట్టు క్రింద రెండువందలు పుచ్చుకోబట్టే ప్రశ్న వేయగానే ఆ చెట్టు జ్ఞప్తికి వచ్చి, వెంటనే దాని దూరం, ఉనికి చెప్పగలిగాడు. దీనిని బట్టి గంగన్న నూటికి నూరుపాళ్ళు రెండు వందలు వెంకన్నగారికి యివ్వవలసిందే!' అని గంగన్నవైపు తీక్షణంగా చూచి, చేతి బెత్తంతో ఛటాలున వీపునకొట్టాడు. దెబ్బతో గంగన్న చేసినతప్పు ఒప్పుకొని మునసబుగారి కాళ్ళపైబడ్డాడు. మునసుబుగార్ని బ్రతిమలాడుకున్నాడు.

మునసబుగారు దయతలచి గంగన్న తరఫున రెండు వందలూ వెంకన్నగారి కిచ్చారు. ఇంకెప్పుడూ నోటులేందే డబ్బు ఎవ్వరికీ యివ్వవద్దని వెంకన్నగారికి వార్నింగు యిచ్చారు. రెండువందలూ తీరేవరకు తన పాలేరుగా ఉండమని గంగన్నకు చెప్పారు. మఱ్ఱిచెట్టు చేసినమేలుకు వెంకన్నగారు దానికి కృతజ్ఞత చెప్పటానికి పసుపు కుంకుమ పట్టుకెళ్ళారు. 'సాక్ష్యమిచ్చిన మఱ్ఱి' చెట్టని యిప్పటికీ దానికిపేరు. జనం ఆవేళా, యిప్పుడూ తండోప తండోలుగా వెళ్ళిదాన్ని చూస్తూంటారు. ★